క్లుప్తంగా

సమాచార చట్టాన్ని సద్వినియోగం చేసుకోండి

సి.బెళగల్: ప్రజలు సమాచార హక్కు చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి మల్లేష్‌కుమార్ అన్నారు. మంగళవారం ఆయన మండల కేంద్రంలోని రైతు సేవా కేంద్రంలో రైతులు, గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేసి, సమాచార హక్కు చట్టం 2005పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ.. ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల నుంచి తగు సమాచారం పొందవచ్చని, నిర్ణీత సమయంలో అధికారులు సమాచారం ఇవ్వకపోతే ఉన్నతాధికారులకు అపీల్ చేయవచ్చని తెలిపారు. సమావేశంలో గ్రామ పెద్దలు చిన్న మునెప్ప, రైతులు, ప్రజలు ఉన్నారు.

పోలకల్‌లో రెవెన్యూ సదస్సు



రైతుల సమస్యలను తెలుసుకుంటున్న తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి

సి.బెళగల్: మండల పరిధిలోని పోలకల్ గ్రామంలో మంగళవారం పాత పంచాయతీ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు జరిగింది. కార్యక్రమానికి భారీగా తరలివచ్చిన రైతులకు ఆయా గ్రామ సచివాలయాల సర్వే సహాయకులు సలహాలు, సూచనలతో పాటు దరఖాస్తులను స్వీకరించారు. తమ భూ సమస్యలను పరిష్కరించాలని 227 మంది దరఖాస్తులు చేసుకున్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ బొంతల మునెప్ప, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వర్లు, మండల సర్వేయర్ నాగభూషణం, వీఆర్వోలు రఫీ, తిమ్మన్న తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు బురాన్‌దొడ్డి విద్యార్థినులు



ఎంపికైన విద్యార్థినులతో పీఈటీ, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి

సి.బెళగల్: మండల పరిధిలోని బురాన్‌దొడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు సత్యకుమార్ తెలిపారు. ఎంపికైన విద్యార్థినులకు, వ్యాయామ ఉపాధ్యాయుడిని పాఠశాల హెచ్‌ఎం నిర్మళ వసంత కుమారి, ఉపాధ్యాయులు మంగళవారం అభినందించారు. పీఈటీ మాట్లాడుతూ.. పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న వీరేషమ్మ మంగళవారం కర్నూలులోని అవుట్‌డోర్ స్టేడియంలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా స్థాయి పోటీలలో ప్రతిభ కనబరచి జిల్లా జట్టుకు ఎంపిక అయ్యిందన్నారు. వీరేషమ్మ జిల్లా జట్టు తరపున ఈనెల 26 నుంచి 28వ తేదీ వరకు విజయవాడలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటుందని చెప్పారు. అదేవిధంగా జిల్లా స్థాయి ఖోఖో పోటీలలో న్న పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని ఇంద్రజ ఉత్తమ ప్రతిభతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



సమస్యలపై చర్చిస్తున్న సీపీఎం నాయకులు

కల్లూరు: కల్లూరు అర్బన్ వార్డులో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం వార్డులోని కార్యకర్తలు కృషి చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు నగేష్ అన్నారు. మంగళవారం కల్లూరు అర్బన్ శరీన్‌నగర్ సీపీఎం కార్యకర్తలతో కల్లూరులోని సూర్యనారాయణ భవనంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శరీన్‌నగర్‌లోని 29, 30, 31వ వార్డులోని సమస్యలపై చర్చించారు. సీపీఎం నాయకులు సుధాకరప్ప, ఏసు, గోకారి, గిడ్డయ్య, వెంకటేశ్వర్లు, రామకృష్ణ, మౌలాలి, దేవదాసు, లక్ష్మిదేవి తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సభల్లో సమస్యలకు పరిష్కారం



మాట్లాడుతున్న తహసీల్దార్ ఆంజనేయులు

కల్లూరు: రైతులు రెవెన్యూ గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఆంజనేయులు అన్నారు. మంగళవారం బొల్లవరం గ్రామంలో రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. రైతుల నుంచి అర్జీలు తీసుకున్నారు. మొత్తం 70 మంది రైతుల నుంచి అర్జీలు వచ్చాయని, వాటిని పరిశీలించి సకాలంలో పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ శ్రీనివాసులు, వీఆర్వో, రైతులు పాల్గొన్నారు.

ఉల్లి రైతు కన్నీరు

- ఉల్లి రైతును నష్టాల పాలు చేస్తున్న వానలు
- చేతికొచ్చిన పంట దెబ్బతింటున్న వైనం
- ధర, దిగుబడి ఉన్నా.. కోతలు కోసుకోలేని దుస్థితి



వెంకటగిరి వద్ద వర్షానికి దెబ్బతిన్న ఉల్లి పంటను ఆరబెట్టుకుంటునేందుకు తీసుకెళుతున్న రైతు



ఉల్లి పొలంలో నిలిచిన వాననీరు



పొలంలో తడిసిపోయిన ఉల్లి

కోడుమూరు రూరల్ : ఆరుగాలం కష్టించి పంటలు పండించే రైతన్నకు అధిక వర్షాలు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. తుపాన్ ప్రభావంతో వారం రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల చేతికొచ్చిన ఉల్లి పంట దెబ్బతింటుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రైతన్నల కృషి ఫలించి ఉల్లి దిగుబడులు బాగున్నప్పటికీ వర్షాలకు రైతులు ఉల్లిని కోతలు కోసి మార్కెట్‌కు తరలించలేని పరిస్థితి నెలకొంది. రైతులు ఎలాగోలా ఉల్లి పంటను పీకి కోతలకు సిద్ధం చేసినప్పటికీ వానలు ప్రతి రోజూ పడుతుండడంతో వాటిని ఆరబెట్టలేని పరిస్థితి. వర్షాలకు చేతికొచ్చిన పంట కళ్లముందరే దెబ్బతింటుండడంతో ఉల్లి రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు.

కోతలకు అగచాట్లు

నియోజకవర్గంలోని కోడుమూరు, గూడూరు, సి.బెళగల్, కర్నూలు రూరల్ గ్రామాల్లో వర్షాధారంగా, బోర్ల కింద 5 వేలకు పైగా ఎకరాల్లో రైతులు ఉల్లి సాగు చేశారు. జిల్లాలోనే అత్యధికంగా కోడుమూరు మండలం వెంకటగిరి గ్రామంలో వర్షాధారం కింద రైతులు 2వేలకు పైగా ఎకరాల్లో ఉల్లి పంట వేశారు. ఒక్కో రైతు 10 నుంచి 15 ఎకరాల వరకు రూ.లక్షలు పెట్టుబడులు పెట్టి ఉల్లి పంట సాగు చేశారు. ప్రస్తుతం పంట కోతకు రావడంతో వారం రోజులుగా కోతలు కోసి మార్కెట్‌కు తరలించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ తరుణంలో వరుసగా పడుతున్న వానలతో చేతికొచ్చిన ఉల్లి పంట కుళ్లిపోతోంది. సోమవారం సాయంత్రం కురుసిన భారీ వర్షం వల్ల వందలాది ఎకరాల్లో పీకి పెట్టిన ఉల్లి తడిసిపోయింది. పొలాల్లో వాననీళ్లు నిలిచిపోయాయి. ఉల్లి దిగుబడులు ఆశాజనకంగా ఉండడంతో పాటు, మార్కెట్లో క్వింటా రూ.3,500ల నుంచి రూ.4వేలు పలుకుతోంది. ఈ నేపథ్యంలో వరుసగా కురుస్తున్న వానలతో ఉల్లి పంట పీకలేక, గడ్డను కోయలేక రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

ఉల్లి కొట్టుకుపోయింది



మూడున్నర ఎకరాల్లో రూ.2లక్షలకు పైగా పెట్టుబడి పెట్టి ఉల్లి పంట సాగు చేశా. ప్రస్తుతం ఉల్లి పంట చేతికి రావడంతో గత 4రోజుల కిందట పీకి పెట్టాను. సోమవారం కురిసిన వానతో పొలంలో నీళ్లు పారి చాలావరకు పంట కొట్టుకుపోవడంతో తీవ్రంగా నష్టపోయా. దిగుబడి బాగున్నా వానల వల్ల ఉల్లిగడ్డలను కోసుకోలేని పరిస్థితి. ఏమి చేయాలో పాలు పోవడం లేదు.

– రైతు దేవరాజు, వెంకటగిరి, కోడుమూరు మండలం

తీవ్ర నష్టం వాటిల్లుతోంది



సొంత పొలం ఆరెకరాలతో పాటు నాలుగెకరాలను కౌలుకు తీసుకుని రూ.5లక్షలకు పైగా పెట్టుబడి ఉల్లి పంట సాగు చేశా. పంట చేతికొచ్చినప్పటి నుంచి వానలు పడుతుండడంతో పంటను కోయలేని పరిస్థితి. వానలు ఎక్కువై ఉల్లి గడ్డ దెబ్బతింటోంది. వానలు తగ్గితేగాని ఉల్లి కోతలు మొదలు పెట్టలేని పరిస్థితి. దిగుబడులు బాగున్నా వానల వల్ల చేతికొచ్చిన పంట దెబ్బతింటుడడంతో తీవ్ర నష్టం వాటిల్లుతోంది.

– రైతు రామాంజినేయులు, వెంకటగిరి గ్రామం, కోడుమూరు మండలం

ప్రజలకు అందుబాటులో ఉండాలి



రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ నాగశేషాచలరెడ్డి

కల్లూరు: ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎంపీడీఓ నాగశేషాచలరెడ్డి అన్నారు. మంగళవారం పెద్దటేకూరు గ్రామ సచివాలయం, అంగన్‌వాడీ కేంద్రాలకు ఆయన తనిఖీ చేశారు. సచివాలయ ఉద్యోగుల హాజరు, రికార్డులను పరిశీలించారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాల్లో రిజిస్టర్లు, రికార్డులను పరిశీలించి పిల్లలకు అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకు న్నారు. ఆయనతో పాటు ఈఓఆర్డీ నాగేష్ ఉన్నారు.

నేడు వీఓఏలకు శిక్షణ

పాణ్యం: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉల్లాస్ పథకంలో భాగంగా మండలంలో నిరక్షరాస్యులను గుర్తించడంపై వీఓఏలు, అంగన్‌వాడీ కార్యకర్తలకు బుధవారం శిక్షణ కార్యక్రమం ఉంటుందని ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. పాణ్యంలోని పొదుపు భవనంలో శిక్షణ ఉంటుందన్నారు. తప్పక హాజరుకావాలని సూచించారు.

సర్వే ఏడీ కార్యాలయ సూపరింటెండెంట్‌గా జ్యోతి

కర్నూలు (సెంట్రల్): జిల్లా సర్వే ఏడీ కార్యాలయ సూపరింటెండెంట్‌గా వి.జ్యోతి నియమితులయ్యారు. ఈమె ప్రస్తుతం చిత్తూరులో ఏడీ కార్యాలయ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్నారు. అక్కడి నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న అబ్దుల్ కలాం చిత్తూరుకు బదిలీ అయ్యారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ సుధాకర్

ఓర్వకల్లు: సమాచార హక్కు చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మండల వ్యవసాయాధికారి సుధాకర్ అన్నారు. మంగళవారం స్థానిక మండల వ్యవసాయాధికారి కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల సిబ్బంది, రైతులకు సమాచార హక్కు చట్టపై అవగాహన కల్పించారు. ఏఓ మాట్లాడుతూ.. 2005లో ఈ చట్టం తీసుకొచ్చారని తెలిపారు. ప్రజలు తమకు కావాల్సిన ఏ సమాచారమైనా సంబంధిత అధికారికి దరఖాస్తు చేసుకుని పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. అర్జీ పెట్టుకున్న 30 రోజుల్లో కోరిన సమాచారాన్ని ఇవ్వాలన్నారు. గడువులోగా సమాచారం ఇవ్వకపోతే ఉన్నతాధికారులకు అప్పీల్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఈఓ భాస్కర్, మాలినీదేవి పాల్గొన్నారు.

ట్రాఫిక్ జాం



ట్రాఫిక్‌లో చిక్కుకున్న అంబులెన్స్

కర్నూలు (రూరల్) : మండల పరిధిలోని వెంకాయపల్లి ఆలయం వద్ద మంగళవారం ట్రాఫిక్ సమస్య తలెత్తింది. ఇక్కడ ట్రాఫిక్ సమస్య ఎన్నో ఏళ్ల నుంచి ఉంది. మంగళ, శుక్రవారాల్లో ఇది నిత్యకృత్యం. పెళ్లి ముహూర్తాలు ఉన్నందున అమ్మవారి దేవర చేసే వారి సంఖ్య పెరిగింది. మధ్యాహ్న సమయాల్లో దేవర కార్యక్రమానికి హాజరై ఇంటకి వెళ్లేవారు, దేవర కార్యక్రమంలో పాల్గొని భోం చేసుకుని తిరుగు ప్రయాణమయ్యేవారు, భక్తులు అధిక సంఖ్యలో రావడంతో ట్రాఫిక్ స్తంభించిపోతోందని స్థానికులు చెబుతున్నారు. గతంలో తాలూకా స్టేషన్ సీఐ ఇక్కడ ట్రాఫిక్ సమస్యను పరిష్కారం చేసేందుకు కర్నూలు–గుంటూరు రహదారిపై టెంకాయలు అమ్మే వ్యాపారస్తులు కేవలం ఫుట్‌పాత్ మీదే వ్యాపారం చేసేలా చర్యలు తీసుకున్నారు. ప్రధాన రహదారుల వెంబడి వాహనాల పార్కింగ్‌ను నిషేధించారు. అమ్మవారి దర్శనానికి వెళ్లే ప్రధాన దారిలో గాజులు, దేవుని పూజ సామగ్రి అమ్మే వ్యాపారస్తులకు స్టాల్స్‌ను కేటాయించే విధంగా చర్యలు తీసుకున్నారు. ఆ అధికారి బదిలీ అవ్వగానే ట్రాఫిక్ సమస్య మొదటికొచ్చింది. ప్రత్యేక వారాల్లో దేవాదాయ శాఖ వారు, తాలూకా పోలీసులు సమన్వయంతో ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

వైన్ షాప్ తరలించాలని మహిళల ఆందోళన



తొగర్చేడు వద్ద వైన్‌షాప్ ఎదుట నిరసన తెలుపుతున్న మహిళలు, ప్రజలు

పాణ్యం: తమ గ్రామ సమీపంలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని తరలించాలని పాణ్యం మండలం తొగర్చేడు గ్రామ ప్రజలు ఆందోళనకు దిగారు. మంగళవారం రాత్రి గ్రామ ప్రజలు, మహిళలు అధిక సంఖ్యలో వచ్చి వైన్‌షాప్ ముందు బైఠాయించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, మహిళలు మాట్లాడుతూ.. తమ గ్రామంలో 54 అడుగుల అభయాంజనేయస్వామి విగ్రహం, బంగారమ్మ ఆలయం ఉండడంతో చుట్టు పక్కల గ్రామాల నుంచి ప్రతి మంగళ, శనివారాల్లో భక్తులు భారీగా వస్తారన్నారు. ప్రతి ఒక్కరూ గ్రామ మెట్ట మీదుగా రావాల్సి ఉందని, అక్కడ మద్యం దుకాణం ఏర్పాటు చేయడంతో భక్తులకు ఇబ్బందిగా ఉంటుందన్నారు. అధికారులకు చెప్పినా చర్యలు తీసుకోలేదన్నారు. కాగా పది రోజులు గడువు ఇవ్వాలని దుకాణ నిర్వాహకులు కోరడంతో మహిళలు ఆందోళన విరమించారు.

ఇళ్ల మధ్య వైన్‌షాపును తొలగించండి



ఎక్సైజ్ సీఐ మంజులకు వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

కోడుమూరు రూరల్ : గూడూరులో నివాస గృహాల మధ్య ఏర్పాటు చేసిన మణికంఠ వైన్స్‌ను వెంటనే తొలగించాలంటూ మెయిన్‌బజార్ కాలనీవాసులు డిమాండ్ చేశారు. అలాగే నివాస సముదాయల మధ్య మద్యం దుకాణం ఏర్పాటు చేయడం వల్ల ఇబ్బందులు పడుతున్నామంటూ స్థానిక కాలనీవాసులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో మంగళవారం కోడుమూరు ఎక్సైజ్ సీఐ మంజుల గూడూరు చేరుకుని మణికంఠ వైన్స్ ఉన్న కాలనీలో విచారణ చేపట్టారు. మద్యం దుకాణం ఏర్పాటు వల్ల మందు బాబులు ఇండ్ల ముందరే బహిరంగంగా తాగుతుండడంతో తీవ్ర ఇబ్బందిగా ఉందంటూ కాలనీవాసులు వాపోయారు. వెంటనే నివాసగృహాల మధ్య ఏర్పాటు చేసిన మణికంఠ వైన్స్ తొలగింపుకు చర్యలు తీసుకోవాలని సీఐకి వినతిపత్రం అందజేశారు. సమస్యను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తామని సీఐ కాలనీవాసులకు హామీ ఇచ్చారు.

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం



గడివేముల: మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటరమణ

గడివేముల: భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ వెంకటరమణ తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని బూజనూరు గ్రామంలో రెవెన్యూ గ్రామ సభ నిర్వహించారు. భూ రీసర్వేలో ఏవైనా తప్పులు ఉంటే గ్రామ సభల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవచ్చని తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ రవీంద్ర ప్రసాద్, ఆర్ఐ వెంకటసుబ్బయ్య, వీఆర్వో ఇందిరమ్మ, సర్పంచ్ రాములమ్మ పాల్గొన్నారు.

–పాణ్యం: రీసర్వే పూర్తి చేసిన గ్రామాల్లో భూ సమస్యలుంటే అర్జీలు ఇవ్వొచ్చని తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి సూచించారు. మంగళవారం ఆలమూరులో గ్రామ సభ నిర్వహించారు. రీసర్వే చేసిన తర్వాత జాయింట్ ఎల్‌పీలు, కొలతల్లో తేడాలు ఉంటే అర్జీలు ఇస్తే వాటిని పరిశీలించి పరిష్కరిస్తామని తెలిపారు. గ్రామంలో 38 వినతులు వచ్చాయన్నారు. డీటీ శివశంకర్‌రెడ్డి, ఆర్ఐ రామ్, సర్పంచ్ మనోహర్ పాల్గొన్నారు.



పాణ్యం: మాట్లాడుతున్న తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి

–ఓర్వకల్లు: మండలంలోని లొద్దిపల్లె గ్రామంలో ఏళ్ల తరబడి సాగు చేసుకున్న పేదల భూములకు పట్టా, పాసు పుస్తకాలు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నాగన్న అధికారులకు విన్నవించారు. మంగళవారం మండలంలోని లొద్దిపల్లె గ్రామంలో రీసర్వే గ్రామ సభ నిర్వహించారు. గ్రామంలో దశాబ్ద కాలం నుంచి దళితులు, బీసీలు ప్రభుత్వ భూముల్లో ముళ్లపొదలు, బండరాళ్లను తొలగించి పంటలు సాగు చేసుకుంటున్నారని తెలిపారు. వారికి పట్టా, పాసుపుస్తకాలు ఇవ్వాలని కోరారు. రీసర్వే డీటీ శర్మిలారెడ్డి, నాయకులు రామస్వామి, మాసూం బాషా పాల్గొన్నారు.



ఓర్వకల్లు: డీటీకి వినతి పత్రం ఇస్తున్న నాయకులు

పంటలను రక్షించుకోవాలి

సి.బెళగల్: రైతులు సస్యరక్షణ పద్ధతులను పాటించి పంటలను చీడపీడల నుంచి రక్షించుకోవాలని ఏఓ మల్లేష్‌కుమార్ సూచించారు. మంగళవారం ఆయన వ్యవసాయ సిబ్బందితో కలిసి మండలంలోని రెండు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఉదయం మండల కేంద్రం సి.బెళగల్‌లో, అదే విధంగా మధ్యాహ్నం మండల పరిధిలోని చింతమానుపల్లె గ్రామ సచివాలయంలో రైతులతో సమావేశం, పొలం పిలుస్తోంది కార్యక్రమాలను నిర్వహించారు. రైతులకు వ్యవసాయంలో చేట్టాల్సిన సంరక్షణ పద్ధతులను, ఆధునిక వ్యవసాయ పద్ధతులను, వ్యవసాయ యాంత్రీకరణపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆయా గ్రామాల్లోని వ్యవసాయ పొలాలను సందర్శించి రైతులకు పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారిణి నాగ సరోజమ్మ, ఎంఈపీఈఓ వెంకటేష్, భాస్కర్, సునంద వీఏహెచ్ శశిదేవి ఉన్నారు.

ఆధార్ సేవలకు అంతరాయం

సి.బెళగల్: మండలంలో మంగళవారం నుంచి సచివాలయాల్లో ఆధార్ సేవల క్యాంప్‌లు సాంకేతిక సమస్యలతో మొదటి రోజు కొన్ని చోట్ల ప్రారంభం కాలేదు. ప్రభుత్వం మంగళవారం నుంచి (22వ తేది నుంచి) 25వ తేది వరకు ఆయా గ్రామాల్లో క్యాంప్‌లను నిర్వహించి ఆధార్ సేవలను అందించాలని ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ముడుమాలలో ఉదయం నుంచి గ్రామస్తులకు ఆధార్ సేవలు అందగా, సి.బెళగల్ – 1 సచివాలయంలో మధ్యాహ్నం ఒంటి గంట అనంతరం ఆధార్ సేవలను పునరుద్ధరించారు. పోలకల్ – 2 సచివాలయంలో మాత్రం సాంకేతిక సమస్యలతో ఆధార్ సేవలు పూర్తిగా నిలిచిపోయాయి.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

గడివేముల: అధిక వర్షాలకు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని, రబీ సాగుకు అన్ని రకాల విత్తనాలను సబ్సిడీతో అందించాలని నంద్యాల జిల్లా రైతు సంఘం కార్యదర్శి జి. సోమన్న, రైతు సంఘం జిల్లా సమితి సభ్యుడు పి.వెంకటేశ్వర్లు కోరారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులు మొక్కజొన్న, మిరప, కంది, మినుము, సొయాచిక్కుడు, వరి, ఉల్లి తదితర పంటలను సాగుచేశారని తెలిపారు. పంట చేతికి వచ్చే సమయంలో భారీ వర్షాలకు నష్టపోయారని చెప్పారు. గత వారంగా కురుస్తున్న వర్షాలకు వరి పంట నెలకొరిగిందని, ఉల్లి కుళ్లిందని, మిరప నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. బ్యాంకు రుణాలను రీ షెడ్యూల్ చేయాలని, పంటలకు విత్తనాలు, ఎరువులు సబ్సిడీతో అందించాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం నాయకులు తిరుపాలు, రసూల్, మద్దిలేటి, సోఫి సాహెబ్, నాగశేషులు, చంద్రన్న పాల్గొన్నారు.

నేటి నుంచి బీఈడీ సెమిస్టర్ పరీక్షలు

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో బుధవారం నుంచి ఈనెల 29వ తేదీ వరకు బీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా 17 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

వివాహ వేడుకలో కాటసాని



వరుడు అక్బర్‌తో మాజీ ఎమ్మెల్యే కాటసాని

పాణ్యం: మాజీ ఉప సర్పంచ్ ఆటోమాబు కుమారుడు అక్బర్ వివాహ వేడుకకు మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి హాజరయ్యారు. మంగళవారం పాణ్యంలోని షాదీఖానాలో జరిగిన వివాహానికి వెళ్లి వధూవరులను ఆశీర్వదించారు. ఆయనతో పాటు జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సద్దల సూర్యనారాయణరెడ్డి, ఎంపీపీ ఉసేన్‌బీ, ఉప సర్పంచ్ పాలం చంద్రశేఖర్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ పుల్లయ్య, సుబ్బరాయుడు, కో–ఆప్షన్ సభ్యులు జాకీర్‌ఉసేన్, చందమామబాబు, గౌడ్ తదితరులు ఉన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎస్ఐ నాగార్జునరెడ్డి

గడివేముల: విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ నాగార్జున రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక రాజరాజేశ్వరి ఉన్నత పాఠశాలలో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీసు వ్యవస్థ చట్టాన్ని అమలు చేయడం, పబ్లిక్ ఆర్డర్‌తో పాటు ప్రజలను రక్షించే లక్ష్యంతో ఏర్పడిన సంస్థ అన్నారు. పౌరుల భద్రత, నేరాల నియంత్రణలో ముఖ్య పాత్ర పోషిస్తుందన్నారు. విద్యార్థులు మొబైల్ ఫోన్‌లకు బానిస కాకుండా చదువుపై దృష్టి సారించాలని సూచించారు. ఎక్కువ సేపు ఫోన్ వినియోగించడం వల్ల శారీరక, మానసిక సమస్యలు వస్తాయన్నారు. చదువులో ఏకాగ్రత తగ్గి వెనుకబడుతారని చెప్పారు. విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరులను గుర్తుకు తెచ్చుకుంటూ ఏటా అక్టోబర్ 21న పోలీసుల అమరవీరుల దినోత్సవం జరుపుకుంటామన్నారు. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ రామేశ్వరరావు, పాఠశాల ఏఓ రాఘవేంద్రరావు, ఉపాధ్యాయులు ఎస్ఐను సన్మానించారు. కానిస్టేబుల్ చెన్నయ్య, మహిళా పోలీసులు పర్వీన్, అమలేశ్వరి పాల్గొన్నారు.

బురదమయంగా రహదారి



బురదమయంగా మారిన రోడ్డుపై ప్రయాణాలు చేసేందుకు ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



కోడుమూరు రూరల్ : కోడుమూరు నుంచి వెంకటగిరి మీదుగా లద్దగిరి వరకు ఉన్న 10 కిలోమీటర్ల రోడ్డులో అడుగుకో గుంత ఏర్పడి వాహనదారులు ప్రయాణాలు చేయలేని విధంగా మారిపోయింది. అధికారులు దెబ్బతిన్న రోడ్డుకు సకాలంలో మరమ్మతులు చేయకపోవడంతో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు బురదమయంగా మారి మరింత అధ్వానంగా తయారైంది. బురదమయంగా మారిన రోడ్లపై ప్రయాణాలు సాగించలేక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎక్కడ జారి పడతామోనని భయంభయంగా బైక్‌లను నడపాల్సిన పరిస్థితి దాపురించింది. సంబంధిత అధికారులు స్పందించి దెబ్బతిన్న వెంకటగిరి నుంచి గోరంట్ల, లద్దగిరి రోడ్డును బాగు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

రహదారి పక్కనే మద్యపానం





రహదారి పక్కనే మందు తాగుతున్న దృశ్యం

కర్నూలు (రూరల్) : కర్నూలు మండల పరిధిలోని సూదిరెడ్డిపల్లె స్టేజీ వద్ద రహదారి పక్కనే వైన్ షాప్ ఏర్పాటు చేశారు.మందు బాబులు మందు కొని రోడ్డు పక్కనే సేవిస్తున్నారు. దీంతో స్టేజ్ వద్ద బస్సుల కోసం వేచివున్న మహిళలు, సమీప వెంచర్లలో నివాసముండి రాకపోకలు సాగించేవారు ఇబ్బందులు పడ్డారు. రోడ్డుపై మహిళలు, కాలేజీలకు వెళ్లే అమ్మాయిలు, ఉద్యోగులు భయంభయంగా రాకపోకలు కొనసాగిస్తున్నారు.

శనగలో విత్తనశుద్ధి కీలకం



టమాట పంటను పరిశీలిస్తున్న అధికారులు

ఓర్వకల్లు: రబీ సీజన్‌లో శనగ సాగు చేసుకునే రైతులు విత్తన శుద్ధి పాటించాలని మండల వ్యవసాయాధికారి సుధాకర్ అన్నారు. మండలంలోని తిప్పాయపల్లె, సోమయాజులపల్లె గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ శాఖ, అనుబంధ శాఖల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో శనగ సాగులో విత్తన శుద్ధిపై రైతులకు అవగాహన కల్పించారు. ఏఓ సుధాకర్ మాట్లాడుతూ.. కిలో విత్తనానికి మూడు గ్రాముల థైరం/కెప్టెన్/ రెండు గ్రాముల కార్బెండిజం/ ఎనిమిది గ్రాముల ట్రైకోడెర్మావిరిడి కలిపి విత్తన శుద్ధి చేసి విత్తుకోవాలని తెలిపారు. ఈ రకంగా శుద్ధి చేసిన విత్తనం ద్వారా నేల నుంచి వ్యాపించే తెగులును అరికట్టవచ్చన్నారు. అలాగే శనగ పంట మొదటిసారి పొలంలో సాగు చేసేవారు రైజోబియం కల్చర్‌తో కూడా విత్తన శుద్ధి చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఈఓ భాస్కర్, రైతులు పాల్గొన్నారు.